క్లుప్తంగా

ఎల్ఐసీ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

పెద్దాపురం: ఎల్ఐసీ ఆవిర్భావ వేడుకలను స్థానిక సంస్థ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు స్థానిక రోటరీ క్లబ్‌లో మెగా రక్తదానం నిర్వహించారు. ఎల్ఐసీ రాజమండ్రి డివిజనల్ అధ్యక్షుడు రావుల మాధవరావు, డివిజన్ ట్రెజరర్ పిండి రెడ్డమ్మ మాట్లాడుతూ సంస్థలో పని చేసే ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంతో ఉంటే సాధించలేనిదంటూ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుసుమంచి కృష్ణంరాజు, అప్పాన నాగేశ్వరరావు, జగదీశ్వర రావు, వాసంశెట్టి గంగ, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

సీఐటీయూ నేత క్రాంతికుమార్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికుమార్

పెద్దాపురం: ఎన్నికల సమయంలో వలంటీర్లకు కూటమి నేతలు ఇచ్చిన హామీని సత్వరమే అమలు చెయ్యాలని సీఐటీయూ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో బుధవారం గడిగట్ల సత్తిబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో పది వేల రూపాయలు ఇస్తామని కూటమి నాయకులు వలంటీర్లకు హామీ ఇచ్చారన్నారు. ఎన్నికలు పూర్తి అయ్యి, అధికారం చేపట్టాక ఒక్కో మాట చెబుతున్నారని, వలంటీర్ల ఆత్మగౌరవంతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. రోజుకో మాట చెప్పడం మాని, ప్రజలకు సేవ చెయ్యడానికి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చెయ్యాలని క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, బంగారయ్య, రమణమ్మ, దివ్య, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక దారి ఆక్రమణ



కొత్తపల్లిలో ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన పశువుల షెడ్డు

కొత్తపల్లి: ఆక్రమణ చేసేందుకు శ్మశాన వాటిక దారిని కూడా వదల్లేదు. మృతదేహాలను కూడా తీసుకెళ్లేందుకు వీల్లేకుండా దారిని కబ్జా చేసి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో పడి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానిక పెద్ద చెరువును ఆనుకుని ఉన్న బందిలదొడ్డిలో పలు కులాలకు సంబంధించిన శ్మశాన వాటికగా ఉంది. ఈ శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో పంట కాలువ ఆనుకుని రహదారిని ఆక్రమించి కొత్తపల్లికి చెందిన ఓ వ్యక్తి సుమారు మూడు సెంట్లలో పశువుల షెడ్డును నిర్మించాడు. దీంతో మృతదేహాలను అంత్యక్రియల కోసం శ్మశాన వాటికకు తీసుకెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు చెరువు గట్టును ఆనుకుని గడ్డిమేటు వేశాడు. గేదెలను రోడ్డుపైనే నిలిపివేయడంతో పొలాలకు వెళ్లే రైతులూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈఓపీఆర్డీ భాస్కరరావును వివరణ కోరగా, దీనిపై విచారణ చేసి, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే షెడ్డు తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించామన్నారు.

పోలీసుల మైకు ప్రచారం



మైకు ప్రచారం చేస్తున్న పోలీసులు

కొత్తపల్లి: దసరా పండగ సమీపిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదంటూ పోలీసులు బుధవారం మైకు ప్రచారం నిర్వహించారు. పండగ రోజుల్లో ఎవరైనా సొంతూళ్లకు వెళ్లేవారు తమకు సమాచారమిస్తే, పోలీస్ నిఘా ఉంచుతామన్నారు. ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ ప్రచారాన్ని నిర్వహించారు.

జై భవానీ

- నేటి నుంచి దసరా ఉత్సవాలు
- శరన్నవరాత్ర వేడుకలకు సర్వం సిద్ధం
- పాదగయ క్షేత్రంలో భారీ ఏర్పాట్లు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయాలు



ఉత్సవాలకు సిద్ధమైన పాదగయ క్షేత్రంలోని పురుహూతికా అమ్మవారు

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాలకు సర్వ సిద్ధమైంది. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేయగా, పిఠాపురం నియోజకవర్గంలో అమ్మవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. రోజుకో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఉన్న అష్టాదశ శక్తి పీఠాలలో పదో శక్తి పీఠమైన పురుహూతికా అమ్మవారు, రాజరాజేశ్వరిదేవిని, గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఉన్న అపర్ణాదేవి అమ్మవార్ల ఆలయాలను శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం చేశారు.

ప్రత్యేక ఏర్పాట్లు

శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కేరళ వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు

ప్రతిరోజు నిర్వహించే ప్రత్యేక పూజల్లో భక్తులందరూ పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించి ఉత్సవాలకు సిద్ధం చేశారు. నియోజకవర్గంలో ప్రముఖ కనకదుర్గ ఆలయాలతో పాటు, వివిధ గ్రామాలలో దుర్గాదేవిని ప్రత్యేక మంటపాలలో నిలిపి, ఉత్సవాలు నిర్వహించడానికి స్థానికులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న కనకదుర్గ ఆలయాలకు రంగులు వేసి కొత్తశోభను సంతరించడంతో పాటు, అన్ని ఆలయాల్లోను ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఎరుపెక్కిన గ్రామాలు

శరన్నవరాత్రి ఉత్సవాలు దగ్గర పడుతున్నాయంటే గ్రామాల్లో జైభవానీ నామస్మరణలు మారుమోగుతుంటాయి. దసరాకు నెల రోజుల ముందు నుంచి భవానీ భక్తులు అమ్మవారి దీక్షలు స్వీకరించి, దసరాకు విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని దీక్షలు విరమిస్తుంటారు. ఎర్రని వస్త్రాలు ధరించి భవానీ మాలలు వేసుకుని, నిష్ఠతో దీక్షలు చేస్తుంటారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు భవానీ దీక్షలు స్వీకరిస్తున్నారు. పాదగయ క్షేత్రంలో వారం రోజుల నుంచి భవానీ దీక్షాధారణలు ప్రారంభించారు. సోమ, మంగళ, బుధవారాల్లో 20 వేలకు పైగా భక్తులు భవానీ దీక్షలు స్వీకరించారు. భవానీ దీక్షాధారణ సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో బుధవారం పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. పాదగయ క్షేత్రంలో ప్రతిరోజు శ్రీరాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వేలాది మంది భవానీ దీక్షలు చేపట్టడంతో గ్రామాలు ఎరుపెక్కాయి. వారం రోజుల నుంచి పాదగయ క్షేత్రంతో పాటు, ఇతర దేవాలయాల్లోను ప్రతి రోజు వందల సంఖ్యలో భవానీ మాలలు ధరించారు.

హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు



పాదగయ క్షేత్రంలో భవానీ దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు



పెద్దాపురం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక వర్తుల వారి వీధిలో వెలసిన భువనేశ్వరి అమ్మవారిని పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో బుధవారం పట్టణ వీధుల్లో ఊరేగించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య పీఠం నుంచి భువనేశ్వరి అమ్మవారిని హంస వాహనంపై కేరళ వాయిద్యాల నడుమ స్థానిక మెయిన్ రోడ్డు, వేంకటేశ్వర స్వామి గుడి, దర్గా సెంటర్, మరిడమ్మ అమ్మవారి ఆలయం మీదుగా అమ్మవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా గోపిశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ, శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలుంటాయన్నారు. పదో రోజున విశేషార్చన, అలంకరణతో పాటు, పూర్ణాహుతి, సాయంత్రం జమ్మిచెట్టుకు పూజ ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు మట్టే శ్రీనివాసరావు, కనకాల సూర్యప్రకాశరావు, తారు వీరభద్రరావు, పొన్నప్రసాద్, ముత్యాల నాగరాజు, చింతా సుమంత్ శర్మ, నమ్మి సత్యనారాయణ, కేబుల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భారీ ఏర్పాట్లు

- నేటి నుంచి రోజుకో అవతారంలో అమ్మవారి దర్శనం

సామర్లకోట: శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఆయా అమ్మవార్ల ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లు, విద్యుద్దీపాలతో అలంకరించారు. స్థానిక పంచారామ క్షేత్రంలో ఉన్న బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేసినట్టు ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. గురువారం ఉదయం విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతి రోజు అమ్మవారు ఓ దేవతామూర్తిగా భక్తులకు దర్శనమిస్తారు. తొలి రోజు బాలాత్రిపుర సందరీదేవిగాను, 4న అన్నపూర్ణదేవిగా, ఐదున గాయత్రీదేవిగా, 6న శ్రీలలితాదేవిగా, 7న కామాక్షిగా, 8న శ్రీమహాలక్ష్మిగా, 9న సరస్వతీదేవిగా, 10న విజయదుర్గగా, 11న మహిషాసురమర్దినిగా, 12న రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిస్తారు. చివరి రోజు సాయంత్రం అమ్మవారికి వెండి చీరతో అలంకరిస్తారని ఈఓ వివరించారు. పండితులు సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి సుందరరామయ్య, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, వేమూరి సోమేశ్వరశర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. రూ.200 చెల్లిస్తే శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతి రోజు గోత్ర నామాలతో, సాయంత్రం కుంకుమార్చన చేస్తారని ఈఓ చెప్పారు. అదేవిధంగా స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న నూకాలమ్మ ఆలయం, బడేలమ్మ చెరువు వద్ద ఉన్న నవదుర్గ ఆలయం, అయోధ్య రామపురంలోని కనకదుర్గ ఆలయం, సత్తెమ్మతల్లి ఆలయం, నీలమ్మ చెరువు వద్ద ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయం, బ్రౌన్‌పేటలోని కనకదుర్గ ఆలయాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



సామర్లకోటలోని బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం



సామర్లకోటలోని నవదుర్గ ఆలయం



పంచారామ క్షేత్రంలోని అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవి

గాంధీ ఆశయ సాధనకు కృషి చేద్దాం

జయంతి వేడుకల్లో చైర్మన్, వైస్ చైర్మన్



మున్సిపల్ పార్క్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

పెద్దాపురం: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అన్నారు. గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా బుధవారం స్థానిక మున్సిపల్ పార్క్‌లోని గాంధీ విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, కౌన్సిలర్లతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ గాంధీజీ శాంతియుత ఆదర్శాలను ప్రజలంతా అనుసరించాలన్నారు. తొలుత పార్కును శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విడదాసరి రాజా, తాటికొండ వెంకటలక్ష్మి, రాజబాబు, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ శ్రీరమణి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ గాంధీజీ అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డీటీ భానుకుమార్, దయానందరాజు తదితరులు పాల్గొన్నారు. కాండ్రకోటలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, గుడివాడలో సర్పంచ్ కనపర్తి చీమదొర, పులిమేరులో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ తదితరులు గాంధీ విగ్రహాలకు నివాళులర్పించారు. పులిమేరులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఒమ్మంగి వీఆర్ఓ షేక్ ఇస్మాయిల్‌ను ఘనంగా సత్కరించారు. పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డులో గాంధీ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు గడిగట్ల సత్తిబాబు, అరుణ్‌కుమార్, మణికంఠ, కూనిరెడ్డి నాని, అమృత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి

కొత్తపల్లి: మండలంలో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకట నారాయణ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ ఆదర్శాలే శ్రేయస్కరం
– మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ

సామర్లకోట: జాతిపిత గాంధీజీ ఆదర్శాలే సమాజానికి శ్రేయస్కరమని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. పట్టణంలో గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న గాంధీ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ నివాళులర్పించారు. మున్సిపాలిటీ పరిధిలోని శానిటరీ వర్కర్లను సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, వైస్ చైర్‌పర్సన్లు ఊబా జాన్ మోజెస్, గోకిన సునేత్రా దేవి, కౌన్సిలర్లు పితాని కృష్ణ, పాగా సురేష్‌కుమార్, పిట్టా సత్యనారాయణ, మర్రి శేషారావు, బలుసు వాసు, వైఎస్సార్ సీపీ నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, చిట్టుమాని శ్రీనివాసు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి స్టేషన్ మేనేజరు ఎం రమేష్, సీనియర్ సెక్షన్ ఇంజినీరు రవికాంత్ నివాళులర్పించారు. హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, పలువురు వర్తకులు పాల్గొన్నారు. పాట్‌ఫాంపై గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఎంపీడీఓ కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీచౌక్‌లో విగ్రహానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు



కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్సై వెంకటేష్



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న అధికారులు

పారిశుధ్య కార్మికులకు పురస్కారాలు



సామర్లకోటలో పారిశుధ్య కార్మికులకు పురస్కారాలు ఇస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. ఇటీవల విజయవాడ వరదల సందర్భంగా సామర్లకోట మున్సిపాలిటీ నుంచి అక్కడకు వెళ్లి సేవలు అందించిన 15 మందికి అవార్డులు అందజేశారు. వారికి ప్రశంసా పత్రాలు, నూతన వస్త్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, శానిటరీ ఇన్‌స్పెక్టరు రాజశేఖర్, ఆర్వో శ్యామల తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

సామర్లకోట: లయన్స్ క్లబ్, జనసేన ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ వాటర్ ట్యాంకుల వద్ద బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు ప్రారంభించారు. క్లబ్ ఆస్పత్రి సిబ్బంది 342 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 45 మందికి ఆపరేషన్లు చేయడానికి జగ్గంపేట లయన్స్ ఆస్పత్రికి పంపుతున్నట్లు ఆస్పత్రి నిర్వాహకుడు కర్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. క్లబ్ ప్రతినిధులు చిత్తూలూరి వీర్రాజు, గుండు శంకరరావు, ఎస్ఆర్వై ప్రసాద్, బడుగు బాబి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కొత్తపల్లి: ఫీడర్లలో మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజనల్ ఈఈ ఏవీఎస్ఎస్ ప్రభాకరావు బుధవారం తెలిపారు. మండలంలోని ఉప్పాడ, కొత్తపల్లి సెంటర్‌లో ఫీడర్లలో మరమ్మతులు జరుగుతున్నట్లు చెప్పారు. దీంతో ఉప్పాడ, పల్లిపేట, అమీనాబాద్, రవీంద్రపురం, రంగంపేట, గ్రామాలతో పాటు, అమరవల్లి, నాగులాపల్లి, పొన్నాడల్లోని రొయ్యల చెరువులు, మూలపేటలోని వాటర్ హౌస్‌కు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.వినియోగదారులు సహకరించాలని కోరారు

పైపులైన్ గోతుల పూడ్చివేత

కొత్తపల్లి: కుళాయి కనెక్షన్లు వేసేందుకు స్థానిక గాదులదొడ్డిలో తవ్విన గోతులను ఎట్టకేలకు పూడ్చివేశారు. 'సాక్షి'లో సోమవారం ×తవ్వి వదిలేశారు× శీర్షికన ప్రచురింతమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గోతులను పూడ్చివేసే చర్యలు చేపట్టారు.

సాక్షి ఇంపాక్ట్



గాదులదొడ్డిలో గొయ్యిని పూడుస్తున్న సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

సామర్లకోట: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వారి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కమిషనర్ ఎ శ్రీవిద్య అన్నారు. స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక నీలమ్మ చెరువు వద్ద ఏర్పాటు చేసిన శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ నీలమ్మ చెరువు గట్టుపై వాకింగ్ ట్రాక్‌ను మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేశారని, దానిని అపరిశుభ్రం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు అనేక మంది మహిళలు, వృద్ధులు, యువతీ, యువకులు వాకింగ్ ట్రాక్‌పై ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తున్నారన్నారు. దీనిపై నిత్యం మద్యం సీసాలు దర్శనమివ్వడం చాలా బాధకరమన్నారు. వాకింగ్ ట్రాక్‌ను బహిరంగ మరుగుదొడ్డిగా తయారు చేస్తున్నారని చెప్పారు. ప్రజల్లో మార్పు రావాల్సి ఉందన్నారు. నీలమ్మ చెరువు గట్టుపై ఉన్న చెత్తను పూర్తిగా తొలగించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రెడ్నం సునీత, పాగా సురేష్‌కుమార్, నేతల హరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టరు జవహర్ రాజశేఖర్ మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు,

ముగిసిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం

సామర్లకోట: రైల్వే స్టేషన్ పరిధిలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవ కార్యక్రమాలు బుధవారంతో ముగిసినట్టు స్టేషన్ మేనేజరు ఎం రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణను శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడు మాత్రమే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఇంటి వద్ద రెండు చెట్లను నాటి వాటిని సంరక్షించాలన్నారు. స్టేషన్‌లో రైల్వే ఉద్యోగులు, ఆర్పీఎఫ్ సిబ్బంది, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే ఉద్యోగులకు, కార్మికులకు, టాక్సీ స్టాండ్, ఆటో స్టాండ్ యూనియన్ల ప్రతినిధులకు, ప్రయాణికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గురువారం నుంచి ఆయా కార్యక్రమాలను అమలు చేసే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజినీరు రవికాంత్, హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి. ఎస్ఎస్ బి శ్రీధర్, స్టేషన్ మాస్టర్ రవికిషోర్, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాసు, చీఫ్ గూడ్స్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, చీఫ్ పార్శిల్ సూపర్‌వైజర్ మోషేడియన్, టిక్కెటు ఇన్‌స్పెక్టర్లు చైతన్య, అజీజ్, జూనియర్ ఇంజినీరు నాగార్జున, పోర్టర్లు పాల్గొన్నారు.



సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణను శుభ్రం చేస్తున్న అధికారులు



నీలమ్మ చెరువు గట్టును శుభ్రం చేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవి గ్రామోత్సవం

సామర్లకోట: గోదావరి తీరాన వేంచేసి ఉన్న అతిపురాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణ స్వామి దేవేరిని లక్ష్మీదేవిగా అలంకరించి బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు, లక్ష్మీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు, సాయంత్రం ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా గ్రామోత్సవం ప్రారంభమైంది. ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గోలి వారి వీధి, గాంధీచౌక్, చిన్న వీధి, పెద్దవీధి, యార్లగడ్డ వారి వీధి, నీలమ్మ చెరువు, మఠం సెంటర్, అయోధ్య రామపురం, కొత్తూరు మీదుగా గ్రామోత్సవం కొనసాగింది. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.



సామర్లకోటలో లక్ష్మీదేవికి నిర్వహిస్తున్న గ్రామోత్సవం